సాక్షి ఒడిశా

బుధవారం । 3 । జనవరి । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు - రూ. 6,49,211

వెండి - 123 గ్రాముల 200 మిల్లీ గ్రాములు

-భువనేశ్వర్/పూరీ



డ్రెడ్జింగ్ పనులకు మోక్షమెప్పుడో?

సీఎం శంకుస్థాపన చేసిన రెండేళ్లు గడిచినా బౌదా నది వద్ద డ్రెడ్జింగ్ పనులు ప్రారంభం కావడం లేదు.

-8లో.



రహదారి భద్రతపై అవగాహన

మల్కన్‌గిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద మంగళవారం రహదారి భద్రతపై అవగాహన రథాన్ని ప్రారంభించారు.

-8లో.

రహదారి రక్తసిక్తం

- కటక్-చాంద్‌బాలి రోడ్డులో ఘోర ప్రమాదం
- బస్సు, ట్రక్కు ఢీకొన్న ఘటనలో ముగ్గురు మృత్యువాత
- 40 మందికి పైగా గాయాలు
- మృతులకు రూ. 3 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన సీఎం
- గవర్నర్ సంతాపం



కటరపాడు ఛక్ ప్రాంతంలో జరిగిన ప్రమాదంలో ధ్వంసమైన బస్సు, ట్రక్కు



ప్రమాదంలో చిక్కుకున్న డ్రైవర్‌ను బయటకు తీస్తున్న దృశ్యం

భువనేశ్వర్: కటక్ జిల్లా నిశ్చింతకొయిలి ప్రాంతంలో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. బస్సు, ట్రక్కు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ముగ్గురు దుర్మరణం చెందారు. 40 మందికి పైగా గాయపడ్డారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. దాదాపు 60 మంది ప్రయాణికులతో మనోరమ అనే ప్రైవేటు బస్సు చాంద్‌బాలీ నుంచి కటక్ వైపు బయలుదేరింది. నిశ్చింతకొయిలి పోలీస్ ఠాణా పరిధి కటరపాడు ఛక్ సమీపానికి వచ్చేసరికి బస్సు, ఎదురుగా వస్తున్న ట్రక్ పరస్పరం ఢీకొట్టాయి. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులు ఘటనా స్థలంలో మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృత్యువాతపడ్డారు. మరో 40 మందికి పైగా గాయపడ్డారు. ధ్వంసమైన వాహనాల్లో చిక్కుకున్న బస్సు, ట్రక్కు డ్రైవర్లను గ్యాస్ కట్టర్ సహాయంతో బయటకు తీశారు. రెండు వాహనాల ముందు భాగాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఘటన తర్వాత రోడ్డుపై భారీగా జనం గుమిగూడడంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసు సిబ్బంది ఘటనాస్థలికి చేరి పరిస్థితి సమీక్షించారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, స్థానికులు బస్సులో చిక్కుకున్న ప్రయాణికులను రక్షించేందుకు సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నిశ్చింతకొయిలి ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చేరిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. తెల్లవారుజామున దట్టమైన పొగ మంచు కమ్ముకోవడంతో డ్రైవర్లకు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ఈ ప్రమాదం జరిగినట్లు అనుమానిస్తున్నారు.

మెరుగైన వైద్యం అందించండి: ముఖ్యమంత్రి

నిశ్చింతకొయిలి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మరణించడం పట్ల ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబీకులకు రూ.3 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఈ ప్రమాదంలో 9 మంది తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స కోసం వీరిని కటక్ ఎస్‌సీబీ మెడికల్ కాలేజీలో చేర్చారు. వీరందరికీ మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

త్వరగా కోలుకోవాలి: గవర్నర్

ఈ దుర్ఘటనలో మృతిచెందిన వారికి రాష్ట్ర గవర్నర్ రఘుబర దాస్ సంతాపం ప్రకటించారు. వీరి కుటుంబీకుల పట్ల సానుభూతి తెలియజేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఎమ్మెల్యే పరామర్శ..

బస్సు ప్రమాదం పట్ల స్థానిక ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ జెనా తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆస్పత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. ఉత్తమ చికిత్స, వైద్య సేవలు అందిస్తామని చెప్పారు. అనంతరం సహాయక చర్యలను పరిశీలించేందుకు ఘటనా స్థలానికి వెళ్లారు.



ఘటనా స్థలంలో మృతదేహం

రొండాపల్లిలో ట్రక్కు ఢీకొని..

జయపురం: సదర్ పోలీసుస్టేషన్ పరిధిలో 26వ నంబర్ జాతీయ రహదారిలో రొండాపల్లి వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ధనపూర్ నుంచి అంబాగుడకు బైక్‌పై ఇద్దరు వస్తుండగా జయపురం నుంచి బొరిగుమ్మ వైపు వెళ్తున్న ట్రక్ ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మృతుడు ధనపూర్ వాసి సొంభారు భూమియ కాగా, గాయపడిన వ్యక్తి భూతమ్ మఝిగా గుర్తించారు.

న్యూస్‌రీల్

పీహెచ్‌డీ కార్యాలయంలో అగ్ని ప్రమాదం



అగ్ని ప్రమాదంలో దగ్ధమైన ఫర్నీచర్, ఫైల్స్

బరంపురం: బరంపురం నగర కోర్టుపేట జంక్షన్‌లోని ప్రజా ఆరోగ్య నీటి సరఫరా (పీహెచ్‌డీ) కార్యాలయంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంగళవారం ఉదయం అగ్ని ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న బరంపురం అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలు అదుపుచేశారు. కార్యాలయంలోని విలువైన ఫర్నీచర్, ఫైల్స్ దగ్ధమయ్యాయని అడిషనల్ చీఫ్ ఇంజినీర్ దెబదాత్త సాహు తెలిపారు. బీఎస్‌పూర్ పోలీసులు కేసు నమోదు చేసి, అగ్ని ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

గవర్నర్‌తో ఇన్‌చార్జి డీజీపీ భేటీ



గవర్నర్‌తో అరుణ్‌కుమార్ షడంగి

భువనేశ్వర్: రాష్ట్ర ఇన్‌చార్జి డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసుగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఐపీఎస్ అధికారి అరుణ్‌కుమార్ షడంగి మంగళవారం రాజ్ భవన్‌లో గవర్నర్ రఘుబర్ దాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు అదనపు డైరెక్టర్ జనరల్ ఆర్.కె. శర్మ, జంట నగరాల పోలీసు కమిషనర్ సౌమేంద్ర కుమార్ ప్రియదర్శి ఉన్నారు.

బ్రాహ్మణవీధిలో చోరీ



ధ్వంసమైన బీరువా

రాయగడ: స్థానిక బ్రాహ్మణవీధిలో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళాలను విరగ్గొట్టి లోపలికి చొరబడి దొంగతనానికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్రాహ్మణ వీధిలో నివాసముంటున్న సుప్రభా సతపతి కుటుంబీకులు డిసెంబర్ 28న పర్లాకిమిడి వెళ్లారు. తిరిగి సోమవారం సాయంత్రం ఇంటికి చేరుకోగా తలుపులు తెరిచి ఉండటం గమనించారు. లోపలకు వెళ్లి చూడగా బీరువా విరగ్గొట్టి ఉండటం కనిపించింది. అందులో 16 తులాల బంగారం, 8 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

930 కిలోల గంజాయి స్వాధీనం

- వ్యాన్ సీజ్, ఒకరు అరెస్టు



గంజాయిని సీజ్ చేసిన ఎక్సైజ్ శాఖ అధికారులు

బరంపురం: బరంపురం నగర సమీపంలోని మౌరి కాళువా ఘాట్ రోడ్డు వద్ద 930 కిలోల గంజాయిని స్థానిక ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నట్లు అదనపు కమిషనర్ రాజేంద్రకుమార్ పాత్రో మంగళవారం తెలిపారు. బరంపురం నగరానికి వ్యాన్‌లో అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నామన్నారు. వ్యాన్‌ను సీజ్ చేశామన్నారు. డ్రైవర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ మార్కెట్‌లో సుమారు రూ.44 లక్షలు ఉంటుందన్నారు.

నేడు శ్రీముఖ సేవ

- జగన్నాథ దర్శనం 4 గంటలు నిలిపివేత

భువనేశ్వర్: పూరీ జగన్నాథ ఆలయంలో జగన్నాథ స్వామి, తోబుట్టువు దేవతలైన బలభద్ర, దేవీ సుభద్రల శ్రీముఖ సేవ (బొనాకొ లగ్గి) బుధవారం జరగనుంది. నిత్యం నిర్వహించే ద్వితీయ భోగ మండప సేవ తర్వాత ప్రారంభిస్తారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మూల విరాటుల సర్వ దర్శనం తాత్కాలికంగా నిలిపి వేస్తారు. అపరాహ్న వేళలో గోప్యంగా బొనాకొ లగ్గి నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది.

వణుకుతున్న బొయిపరిగుడ



సమితి గ్రామాల్లో చలి కాగుతున్న దృశ్యం



దట్టమైన మంచులో బాలుడు

జయపురం: జయపురం సబ్ డివిజన్ బొయిపరిగుడ సమితిలో ఉష్ణోగ్రత వణికిస్తోంది. సమితిలోని అన్ని ప్రాంతాల్లో పొగ మంచు దట్టంగా పడుతోంది. దీంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం పది గంటల వరకు రోడ్లపై వాహనాలు కూడా కనిపించడం లేదు.

మద్యం దుకాణం ఉద్యోగి హత్య

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొరిగుమ్మ సమితి దుబులి గ్రామ సమీపంలోని ఓ పాతబావిలో మృతదేహం కనిపించడంతో స్థానికులు మంగళవారం పోలీసులకు సమాచారం అందజేశారు. వారు వచ్చి మృతదేహాన్ని చూసి దర్యాప్తు చేయగా.. ఆ మృతదేహం పాతబొరిగుమ్మలోని ఓ మద్యం దుకాణంలో పనిచేస్తున్న యువకుడిదిగా తేలింది. బీహార్ రాష్ట్రానికి చెందిన ఉమేష్ యాదవ్(32) ఇక్కడ నాలుగు నెలలుగా పని చేస్తున్నాడు. కొన్ని రోజుల కిందట ఏద పనిపై దుబులి గ్రామానికి వెళ్లాడు. కానీ తిరిగి రాలేదు. దీంతో మద్యం దుకాణం మేనేజర్ బినయ గుప్త డిసెంబర్ 30న స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దుకాణం సిబ్బంది పోలీసులు అతడి కోసం గాలించినా ఆచూకీ దొరకలేదు. చివరకు ఇలా బావిలో శవమై తేలాడు. ఉమేష్‌ను ఎవరో హత్య చేసి పడేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. కొరాపుట్ నుంచి క్లూస్ టీమ్ వచ్చి దర్యాప్తు చేసింది. దీనిపై బొరిగుమ్మ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

14న 'సేవ్ జగన్నాథ సాగర్' మారథాన్



జయపురం సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న జగన్నాథ్ సాగర్ ట్రస్ట్ సభ్యులు

జయపురం: జయపురంలో చరిత్రాత్మక జగన్నాథ్ సాగర్‌ను పరిరక్షించాలని 'మో జగన్నాథ్ సాగర్ ట్రస్ట్' జయపురం ఆధ్వర్యంలో ఈ నెల 14న మారథాన్ పరుగు నిర్వహించనున్నారు. ఈ మేరకు ట్రస్టు అధ్యక్షుడు రజినీ కాంత నాయిక్ మంగళవారం వెల్లడించారు. ఆయన నేతృత్వంలో కొందరు జయపురం సబ్ కలెక్టర్ ప్రశాంత కుమార్ పరిడను కలసి ఈ మేరకు అనుమతి కోరారు. ఆదివారం ఉదయం 7 గంటలకు శ్రీ పంచానన మందిరం నుంచి పరుగు ప్రారంభిస్తామన్నారు. జగన్నాథ్ సాగర్ పరిస్థితిపై ప్రజలను చైతన్య పరిచేందుకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు వెల్లడించారు.

'ఆస్తుల సమగ్ర వివరాలు దాఖలు చేయాలి'

భువనేశ్వర్: ప్రభుత్వ ఉద్యోగులు తమకు సంబంధించిన ఆస్తుల సమగ్ర వివరాల్ని దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఈ మేరకు ఈ నెలాఖరు వరకు గడువు కల్పించింది. 2023 సంవత్సరానికి సంబంధించిన వార్షిక ఆస్తుల వివరాలతో సమగ్ర జాబితా జనవరి 31లోగా సమర్పించాలని ఉద్యోగులను కోరింది. సాధారణ పాలన, ప్రజాభియోగాల విభాగం సోమవారం అన్ని విభాగాలు, శాఖల ఉన్నతాధికారులు, ఆర్‌డీసీలు కలెక్టర్లకు ఈ మేరకు లేఖలు రాసింది. గ్రూప్ డి నుంచి గ్రూప్ ఏ వరకు ప్రభుత్వ ఉద్యోగులందరూ గత సంవత్సరానికి సంబంధించిన ఆస్తుల తాజా వివరాల జాబితా హెచ్‌ఆర్‌ఎంఎస్ పోర్టల్ ద్వారా గడువు తేది నాటికి సమర్పించాలని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తన (సవరణ) నిబంధనలు - 2021 ప్రకారం ఉద్యోగులు తమ స్థిరాస్తులు, చరాస్తులతో సహా, వాటి విలువకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఆన్‌లైన్‌లో హెచ్‌ఆర్‌ఎంఎస్ పోర్టల్ ద్వారా సమర్పించాలని శాఖ అదనపు కార్యదర్శి శశాంక్ శేఖర్ దాష్ జారీ చేసిన లేఖలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మార్గదర్శకాల ప్రకారం ఆస్తి వివరాలు సమర్పించడానికి వారి అధికార పరిధిలోని ఉద్యోగులకు అవగాహన కల్పించాలని అనుబంధ శాఖల ఉన్నతాధికారులు, ఆర్‌డీసీలు, కలెక్టర్లను ఆదేశించారు.

అయోధ్య రాముడి అక్షింతలు పంపిణీ



కొత్త వీధిలో అక్షింతలు, ఫొటోలు పంపిణీ చేస్తున్న దృశ్యం

జయపురం: అయోధ్యలో నూతనంగా నిర్మించిన శ్రీరామ మందిరం ప్రతిష్ఠ ఉత్సవాలు ఈ నెల 22న నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో జయపురానికి చెందిన అయోధ్య శ్రీరామ మందిర ప్రతిష్ఠ ఉత్సవ కమిటీ సభ్యులు మంగళవారం ఇంటింటికీ వెళ్లి శ్రీరాముడి ఫొటో, అక్షింతలు అందజేశారు. జయపురం ప్రజల ఆరాధ్య దేవి జగత్ జననీ మందిరంలో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు, శ్రీరాముడి ఫొటోలు, ఆహ్వాన పత్రికలను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. మందిర పరిచాలన కమిటీ సభ్యులకు అక్షింతలు అందించారు. కొత్తవీధి మొదటి లైన్, కొత్తవీధి-2 వ లైన్, కొత్త వీధి-3వ లైన్‌లో ప్రచారం నిర్వహించారు. 22వ తేదీన దీపాలంకరణ చేసి వీధులను దేదీప్యమానంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. కమిటీ సభ్యులు నిరంజన్ పాణిగ్రాహి, ప్రేమానంద నాయిక్, జగేశ్వరి పాణిగ్రాహి, సరోజిని పట్నాయక్, బుధు నాయిక్, జ్యోతిరంజన్ పాణిగ్రాహి, నిఖిల్ సాహు, రశ్మిత నాయిక్, బాబు రాయ్, రాము పట్నాయక్, సరిత పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

హరేకృష్ణ మెహతాబ్‌కు ముఖ్యమంత్రి నివాళి



భువనేశ్వర్: డాక్టర్ హరేకృష్ణ మెహతాబ్ వర్ధంతి సందర్భంగా సీఎం నవీన్ పట్నాయక్ ఆయనకు మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. స్వతంత్ర్య ఒడిశా ప్రముఖుల్లో మెహతాబ్ ఒకరు. ఆయన స్వాతంత్ర్య సమరయోధుడు కూడా. ఉత్కళ కేసరిగా రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయారు. రాష్ట్ర పురోగతి, సాహితీ, సంస్కృతి విలువల పరిరక్షణలో ఆయన పాత్ర గణనీయమని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ గుర్తు చేశారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముదులి

రాయగడ: రాష్ట్రంలోని క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని రాయగడ ఎమ్మెల్యే ముదులి అన్నారు. స్థానిక భారిజోల వద్ద గల మైదానంలో మంగళవారం రాయగడ సమితి ఆధ్వర్యంలో ప్రారంభమైన క్రీడోత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగానికి పెద్దపీట వేస్తోందన్నారు. మారుమూల ప్రాంతాల్లో ఎంతో మంది ఉత్తమ క్రీడాకారులు ఉన్నప్పటికీ.. వారికి సరైన ప్రోత్సాహం లేకపోవడంతో రాణించలేకపోతున్నారన్నారు. దీనిని దష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నువా-ఓ క్రీడోత్సవాలను నిర్వహిస్తుందన్నారు. అన్ని సమితుల్లోనూ క్రీడలను నిర్వహిస్తున్నామని వివరించారు. సమితి అధ్యక్షురాలు టున్ని హుయిక, వైస్ చైర్మన్ హరప్రసాద్ మాట్లాడుతూ.. రెండు రోజులపాటు జరిగే ఈ క్రీడోత్సవాల్లో సమితి పరిధిలో గల 28 పంచాయతీల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ తదితర పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. జిల్లా పరిషత్ సభ్యురాలు సంధ్యా పులక, జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షుడు గంగాధర్ పువ్వల, బీడీఓ అమూల్యకుమార్ సాహు, డాక్టర్ సునీల్ మహాపాత్రో తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బరంపురం యూనివర్సిటీ వ్యవస్థాపక దినోత్సవం



ప్రసంగిస్తున్న వైస్ చాన్స్‌లర్ గీతాంజలి దాస్



బరంపురం విశ్వ విద్యాలయం 58వ వ్యవస్థాపక దినోత్సవాల్లో ప్రారంభ గీతం పాడుతున్న అతిథులు



58వ వ్యవస్థపక దినోత్సవాల్లో పాల్గొన్న ప్రముఖులు, విద్యార్థులు

బరంపురం : మన దేశం అగ్రరాజ్యాలతో సమానంగా నిలవాలంటే నాణ్యతమైన విద్యతో పాటు యూనివర్సిటీల్లో ఆధునిక పరిశోధనలు చేపట్టాలని డాక్టర్ హరిహరదాస్ అన్నారు. స్థానిక బంజవీహార్ ప్రాంగణంలోని బిజు పట్నాయక్ అడిటోరియంలో బరంపురం విశ్వ విద్యాలయం 58వ వ్యవస్థాపక దినోత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ గీతాంజలి దాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డాక్టర్ హరిహర దాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తాను గంజాం జిల్లా ఛత్రపూర్‌కి చెందిన వాడినని, ఇదే వర్సిటీలో చదివి ఉన్నత స్థాయికి వెళ్లానని చెప్పారు. విద్యార్థుల్లో పోటీ తత్వం ఉండాలని, ఉత్తమ ఆలోచనలతో లక్ష్యాలు సాధించాలన్నారు. వీసీ గీతాంజలి దాస్ మాట్లాడుతూ 1967లో బరంపురం విశ్వ విద్యాలయం స్థాపించారని, దీని ఆధ్వర్యంలో 181 కాలేజీలు ఉన్నాయని తెలిపారు. త్వరలో మరిన్ని కోర్సులు అందుబాటులోకి వస్తాయన్నారు.

క్లుప్తంగా

బొల్లినేని మెడిస్కిల్స్‌లో కొత్త కోర్సులు ప్రారంభం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో గల బొల్లినేని మెడిస్కిల్స్‌లో బీఎస్సీ పారా మెడికల్ నూతన కోర్సులను ప్రారంభించినట్లు ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ ట్రాన్స్‌ఫ్యూషన్ టెక్నాలజీ కోర్సులో ఐదు సీట్లు, రేడియోథెరపీ, టెక్నాలజీ కోర్సుల్లో రెండు సీట్లు ఫిజీషియన్ అసిస్టెంట్ కోర్సుల్లో ఐదు సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కోర్సులకు గాను ఇంటర్ బైపీసీ పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు 7680945357, 9121999654 నంబర్లను సంప్రదించాలన్నారు.

పోలీసుల దాడుల్లో 8 మంది జూదగాళ్లు అరెస్ట్

ఆమదాలవలస: మండలంలోని అక్కులపేట తోటల్లో మంగళవారం ఆమదాలవలస ఎస్‌ఐ వై.కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో 8 మంది జూదగాళ్లు పట్టుబడ్డారు. వారివద్ద నుంచి రూ. 1.02,230 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే 4 ద్విచక్రవాహనాలు, 9 సెల్‌ఫోన్‌లు సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

నేడు సిక్కోలు డ్వాక్రా బజార్ ప్రారంభం

శ్రీకాకుళం పాతబస్టాండ్: సిక్కోలు డ్వాక్రా బజారు–2024 పేరిట స్వయం సహాయక సంఘాల మహిళలు రూపొందించిన వస్తు, వస్త్ర ప్రదర్శనలు, విక్రయాలను బుధవారం సాయంత్రం నుంచి ప్రారంభించనున్నట్లు గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు డాక్టర్ డీపీ విద్యా సాగర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఏడు రోడ్ల కూడలి వద్ద గల నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల మైదానంలో ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9.30 వరకు డ్వాక్రా బజారు తెరచి ఉంటుందని చెప్పారు. జిల్లాలో మహిళలు తయారుచేసిన వస్తు సామగ్రితో పాటుగా ఉప్పాడ, కాకినాడ శారీలు, జిల్లాలో పొందూరు ఖద్దరు, కాటన్ చీరలు, అరకు కాఫీ, కర్నూలు చేనేత వస్త్రాలు, సిల్క్ చీరలు, మదనపల్లి సిల్క్ చీరలు, వివిధ చేతివృత్తుల ప్రత్యేక వస్తువులు ఉంటాయని ఆయన తెలిపారు.

వెటర్నరీ డైరీ ఆవిష్కరణ



క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: ఆంధ్రప్రదేశ్ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీయన్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుల సమక్షంలో రాష్ట్ర పశుసంవర్ధక పాడి పరిశ్రమల మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు వెటర్నరీ డైరీని మంగళవారం ఆవిష్కరించా రు. పలాసలో మంత్రి స్వగృహంలో కొత్తడైరీ, వాల్‌పోస్టర్, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అదే విధంగా శాఖా కార్యాలయాల్లో పలు సమస్యలపై వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో గుంటూరు, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం చైర్మన్‌లతో పాటు జోన్-01కు సంబంధించిన మూడు సంఘాల సభ్యులు పాల్గొన్నారు. అమరావతి చైర్మన్ సేవా నాయక్, జనరల్ సెక్రటరీ బి.గోవిందరాజులు పాల్గొన్నారు.

సుడా పరిధిలోకి పాతపట్నం

పాతపట్నం: శ్రీకాకుళం అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ(సుడా) పరిధిలోనికి పాతపట్నంను చేర్చుతూ ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించిందని, ఇళ్ల లేఅవుట్‌లకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ పి.జయంత్ ప్రసాద్ మంగళవారం తెలిపారు. సుడా పరిధిలోనికి పాతపట్నం, అంతరాబ, ప్రహరాజపాలేం, కొరసవాడ, బూరగాం, కాగువాడ రెవెన్యూ గ్రామాలతో పాటు మండలం మొత్తం రెవెన్యూ గ్రా మాలను తీసుకువచ్చారన్నారు. దీంతో పాతపట్నం మండలంలోని 48 రెవెన్యూ గ్రామాల్లోని, 181.02 చదరపు కిలోమీటర్ల వైశాల్యంలో సుడా పరిధి విస్తరించి ఉందన్నారు. పాతపట్నం రెవెన్యూ పరిధిలో 4.76 చదరపు కిలోమీటర్ల పరిధి, అంతరాబ రెవెన్యూ పరిధిలో 4.32 చదరపు కిలోమీటర్లు, కొరసవాడ రెవెన్యూ పరిధిలో 6.8 చదరపు కిలోమీటర్లతో పాటు మండలంలోని రెవెన్యూ గ్రామాలు తీసుకువచ్చారన్నారు. ఈ పరిధిలోని లే అవుట్‌లను, ప్లాన్‌లకు ఇక నుంచి సుడాలో అనుమతి పొందాల్సి ఉంటుందని తెలిపారు. పాతపట్నం మండల కేంద్రంలో ఇళ్ల నిర్మాణం చేయాలంటే తప్పనిసరిగా సుడాలో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాల్సిందేనని ఎంపీడీఓ తెలిపారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఉదారత


కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని ఉదయపురం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో సింగిల్ పేరెంట్ ఉన్న పిల్లలకు కిట్లను పంపిణీ చేశారు. ఇదే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు జుత్తు పురుషోత్తం చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్ వంటి చదువుకు అవసరమైన వస్తువులతో కూడిన కిట్లను అందించారు. తల్లిదండ్రులు లేని పదిహేడు మంది చిన్నారులకు అందించారు. ఏటా ఈ కార్యక్రమం కొనసాగుతోంది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డ్రెడ్జింగ్ పనులకు మోక్షమెప్పుడో?

- బౌదా నదిపై ముందుకు సాగని పనులు
- మూసుకుపోయిన ముఖద్వారం
- ఇబ్బందుల్లో మత్స్యకారులు



డ్రెడ్జింగ్ పనులకు శంకుస్థాపన చేస్తున్న సీఎం నవీన్ పట్నాయక్ (ఫైల్)



గోపాల్‌పూర్ తీరం వద్ద ఉప్పు నీటి సరస్సు

బరంపురం : అంతర్జాతీయ పర్యాటక స్థలంగా గుర్తింపు పొందిన గోపాల్‌పూర్ తీరంలో బంగాళఖాతం వద్ద మూసుకుపోయిన బౌదా నది ముఖద్వారం డ్రెడ్జింగ్ పనులకు మోక్షం కలగడం లేదు. రెండేళ్ల కిందట ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ కోటిన్నర రూపాయల నిధులు విడుదల చేసి స్వయంగా ఆయనే శంకుస్థాపన చేశారు. రెండేళ్లు కావస్తున్నా ఇంతవరకు పనులు ప్రారంభం కాకపోవడంతో మత్స్యకారులకు ఇబ్బందులు తప్పడం లేదు. గోపాల్‌పూర్ తీరం పరిసర ప్రాంతాల్లో ఉన్న సున్‌పూర్, మార్కండి, కొత్తూరు, పట్టి సూన్‌పూర్, పాలూరు, భక్షిపల్లి, రామయ్యపట్టణం, గౌశాబందా తదితర ప్రాంతాల్లో సముద్రంపై చేపల వేట ఆధారంగా వేలాది మంది మత్స్యకారులు జీవనం సాగిస్తున్నారు. బౌదా నది ముఖద్వారం మూసుకుపోవడంతో దానిని సరిదిద్దేందుకు డ్రెడ్జింగ్ పనులకు శ్రీకారం చుట్టడంతో అందరూ ఆనందించారు. అయితే పాలకుల నిర్లక్ష్యం కారణంగా పనుల్లో కదలిక లేకపోవడంతో మత్స్యకారులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సీఎం నవీన్ దృష్టి సారించి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని గంజాం జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షుడు ఎ.సింహాద్రి కోరారు.



తీరంలో నిలిచిన పడవలు



ఇసుక దిబ్బలుగా మారి మూసుకుపోయిన బౌదా నది-సముద్ర ముఖద్వారం

లక్ష్మణానంద సరస్వతి హత్యపై
సీబీఐ విచారణకు పిల్

- ఒడిశా ప్రభుత్వానికి హైకోర్టు నోటీసు

భువనేశ్వర్: కంధమల్ జిల్లాలో జరిగిన వీహెచ్‌పీకి చెందిన స్వామి లక్ష్మణానంద సరస్వతి హత్యపై సీబీఐ విచారణ జరిపించాలని కోరుతూ రాష్ట్ర హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. 15 ఏళ్ల క్రితం ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన క్రైం శాఖ దర్యాప్తు పట్ల తలెత్తిన అసంతృప్తి సీబీఐ విచారణని ప్రేరేపిస్తుందనే వివరణలో హైకోర్టులో పిటిషన్ దాఖలు కావడం విశేషం. ఈ వ్యాజ్యం స్వీకరణ పురస్కరించుకుని వివరణ కోరుతూ హైకోర్టు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. 2008 ఆగస్టు 23న జన్మాష్టమి నాడు కంధమల్ జిల్లా జలేస్‌పేట ఆశ్రమంలో వీహెచ్‌పీకి చెందిన స్వామి లక్ష్మణానంద సరస్వతితో నలుగురు శిష్యులు హత్యకు గురయ్యారు. ఈ ఘటనపై క్రైం బ్రాంచ్ దర్యాప్తుకు ఆదేశించింది. లక్ష్మణానంద సరస్వతి హత్య వ్యవహారంలో మావోయిస్టుల ప్రమేయం ఉందనే అనుమానం బలంగా వ్యాపించింది. ఈ సంచలనాత్మక హత్య వెనుక ఖచ్చితమైన వ్యూహం ఏమిటో క్రైం శాఖ దర్యాప్తు ఛేదించలేకపోయింది. దర్యాప్తులో నాలుగు ముఖ్యమైన అంశాలను పట్టించుకోకుండా విచారణ జరిపించింది. అయినా వాస్తవం తేలలేదు. లక్ష్మణానంద సరస్వతి గిరిజనుల అభివృద్ధికి పాటుపడి మత మార్పిడి, పశువుల అక్రమ రవాణాను తీవ్రంగా వ్యతిరేకించారు. అప్పట్లో అధికారంలో ఉన్న యూపీఏ ప్రభుత్వం 2008 ఆగస్టు 15న స్వామి లక్ష్మణానంద సరస్వతి భద్రత కోసం మోహరించిన సీఆర్పీఎఫ్ జవాన్లను వెనక్కి తీసుకుందని పిటిషనర్ తరఫు న్యాయవాది హైకోర్టు ధర్మాసనం దృష్టికి తీసుకుని వెళ్లారు. అక్కడ నుంచి 8 రోజుల తరువాత ఒడిశా పోలీసు సిబ్బంది హాజరుకాలేదు. తదనంతరం స్వామీజీ హత్యకు గురయ్యారు. దీనికి యూపీఏ, బిజూ జనతా దళ్ ప్రభుత్వాలు బాధ్యులని పిటిషనర్ పేర్కొన్నారు. ఈ కేసుపై సీబీఐ విచారణకు ఎందుకు ఆదేశించలేదో ఈ ఏడాది మార్చి 5లోగా సమాధానం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది.

ప్రసవానికి ముందు వేదన




గర్భిణిని డోలీ మీద తరలిస్తున్న గిరిజనులు



అంబులెన్స్ వద్దకు చేరిన గిరిజన యువతి ముదలి

కొరాపుట్: నిండు గర్భిణిని మూడు కిలోమీటర్ల దూరం డోలీపై తరలించిన ఘటన కొరాపుట్ జిల్లాలో జరిగింది. కొరాపుట్ జిల్లా దశమంతపూర్ సమితి డువార్ గ్రామ పంచాయతీ హల్దిసీల్ గ్రామంలో పుర్తి వాస్ ముదలి భార్య పుల్ మదలికి మంగళవారం పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో ఆ గ్రామ ఆశ కార్యకర్త ముని ఖోరాకి కుటుంబ సభ్యులు సమాచారం అందజేశారు. ఆమె 102 అంబులెన్స్‌కు కాల్‌చేశారు. అయితే వాహనం వచ్చేందుకు రోడ్డు మార్గం లేకపోవడంతో బండి గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఆగిపోయింది. దీంతో స్థానికులు మంచాన్ని డోలీలా చేసి ఆమెను మూడు కిలోమీటర్ల మేర మోసుకుని వెళ్లారు. ఎముకలు కొరికే చలిలో గర్భిణిని అత్యంత కష్టం మీద అంబులెన్స్ వరకు తీసుకెళ్లారు. ఆ తర్వాత అంబులెన్స్‌లో ఆమెను దశమంతపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మ‘హిమం’తా ప్రకృతిదే



జి.సిగడాంలో ఉదయం 5.20 గంటలకు మంచుతో అలుముకున్న రహదారులు



జి.సిగడాంలో ఉదయం 6 గంటలకు మంచు పడుతున్న దృశ్యం



7:10 గంటల ప్రాంతంలో మంచు ఇలా



8.30 గంటలకు మంచుతో కమ్ముకున్న గ్రామాలు

పల్లెలు పొగ మంచు గుప్పిట చిక్కుకుంటున్నాయి. వేకువజామున ఊరి దారులను కమ్మేస్తున్న మంచు తెరలు వాహనదారులను తెగ ఇబ్బంది పెడుతున్నాయి. – జి.సిగడాం

ఆటో బోల్తా.. కార్పెంటర్ మృతి

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని తంగివానిపేట గ్రామానికి చెందిన శిమ్మ శ్రీకాంత్ (21) సోమవారం అర్ధరాత్రి తర్వాత జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. రూరల్ పోలీసులు ఇచ్చిన వివరాల మేరకు.. కార్పెంటర్‌గా పనిచేస్తున్న శ్రీకాంత్ తన వ్యక్తిగత పని కోసం దగ్గరి బంధువు మోహన్‌తో కలిసి ఆటో లో శ్రీకాకుళం వెళ్లి తిరిగి వస్తుండగా అర్ధరాత్రి దాటాక నీలం ఆటో షోరూం వద్దకు రాగానే ఇసుక కుప్ప దిబ్బ వద్ద ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో శ్రీకాంత్ అక్కడికక్కడే మృతి చెందాడు. 108లో రిమ్స్‌కు తరలించినప్పటికీ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి లక్ష్మణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


రిమ్స్‌లో విద్యార్థుల మధ్య కొట్లాట

శ్రీకాకుళం: రిమ్స్ వైద్య కళాశాలలో విద్యార్థులు రెండు వర్గాలుగా విడిపోయి కొట్టుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆదివారం రాత్రి కొందరు విద్యార్థులు మద్యం సేవించి వచ్చి హాస్టల్ భవనంలో దాడులు చేసుకోవటంతో తొమ్మిది మంది గాయపడినట్లు సమాచారం. ఈ దాడులకు భయపడిన తోటి విద్యార్థులు పోలీసులకు సమాచారం అందించగా రాత్రి రెండు గంటల సమయంలో పోలీసులు వచ్చి పరిస్థితిని చక్కదిద్ది వెళ్లారు. ఈ విషయాన్ని రెండో పట్టణ పోలీసులు ధ్రువీకరిస్తున్నారు. దాడుల విషయం సోమవారం ఉదయం రిమ్స్ కళాశాల అధికారుల దృష్టికి వెళ్లింది. దీనిపై విచారణ కమిటీని నియమించిన ప్రిన్సిపాల్ విషయం మీడియా దృష్టికి వెళ్లకుండా గోప్యంగా ఉంచేందుకు ప్రయత్నించా రు. ఆస్పత్రి సలహా మండలి సభ్యులు వరుదు విజయ్ కుమార్ కూడా జరిగిన సంఘటనను ధ్రువీకరించటంతో పాటు విద్యార్థులపై చర్య లు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటాచలంను వివరణ కోరగా సమాచారం ఇవ్వడానికి నిరాకరించారు. ఇలాంటి సంఘటన గత నెలలో జరిగిందని వారిని వసతి గృహం నుంచి బయటకు పంపించామని ప్రిన్సిపాల్ చెప్పారు.

తెలుగు మహాసభలకు తరలిరండి

శ్రీకాకుళం కల్చరల్:

రాజమహేంద్రవరంలో ఈ నెల 5, 6, 7 తేదీల్లో నిర్వహించే అంతర్జాతీయ తెలుగు మహాసభలకు అందరూ తరలి రావాలని ఆంధ్ర సారస్వత పరిషత్ జిల్లా సంఘం పిలుపునిచ్చింది. స్థానిక గిడుగు రామ్మూర్తి విగ్రహం నుంచి మంగళవారం జిల్లా ప్రధాన కార్యదర్శి లఖినాన రవికుమార్, భోగెల ఉమాకవిల ఆధ్వర్యంలో శోభాయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మభాషను గౌరవించడానికి, కాపాడుకోవడానికి మనమంతా నడుం కట్టడానికి రాజమహేంద్రవరం సభలకు కవులు, కళాకారులు, రచయితలు తరలి రావాలని సభలను విజయవంతం చేయాలని అన్నారు. తెలుగు సభలకు సంఘీభావం ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ర్యాలీలో చాడ శ్రీనివాస్, కరణ్‌కుమార్, గాంధీ, బలివాడ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



గిడుగు విగ్రహం వద్ద నుంచి శోభాయాత్ర ప్రారంభం

రహదారి భద్రతపై అవగాహన



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద మంగళవారం రహదారి భద్రపై అవగాహన రథాన్ని ప్రారంభించారు. ముందుగా కార్యాలయం నుంచి పలు పాఠశాలల విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. అదనపు కలెక్టర్ వేద్బర్ ప్రధాన్ ర్యాలీతో పాటు రథాన్ని ప్రారంభించారు. వారం రోజుల పాటు ఈ రథం పలు ప్రాంతాల్లో తిరిగి రోడ్డు నియమాలపై అవగాహన కల్పిస్తుందని పేర్కొన్నారు.



కలెక్టర్ కార్యాలయం వద్ద చైతన్య రథం ప్రారంభించిన జిల్లా అదనపు కలెక్టర్ వేద్బర్ ప్రధాన్

కాల్పుల్లో మరణించిన వారికి అశ్రునివాళి



కళింగానగర్ కాల్పుల్లో మృతి చెందిన వారికి అంజలి ఘటిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పర్లాకిమిడి: జాజీపూర్ టాటా కంపెనీ నిర్మాణ సమయంలో అసువులు బాసిన గిరిజనులకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నివాళులర్పించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆవరణలో కాంగ్రెస్ కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే త్రినాథ సాహు విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు.

కార్యక్రమంలో ఒడిషా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శరత్ పట్నాయక్, గజపతి జిల్లా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు బసంత పండా, బబులీ మహాపాత్రో, అభిమన్యు పండా, సూర్య పాత్రో, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ



కలెక్టర్ కార్యాయంలో నలుగురు దివ్యాంగులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ

పర్లాకిమిడి: కలెక్టరేట్‌లో సోమవారం గ్రీవెన్స్ సెల్ తర్వాత కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ దివ్యాంగులకు ల్యాప్‌టాప్ అందజేశారు. ఉన్నత చదువుల కోసం దివ్యాంగులు జిల్లా సామాజిక సురక్ష, అంగవికలాంగుల స్వసశక్తీకరణ విభాగానికి దరఖాస్తు చేసుకున్నారు. దీంతో సిద్ధాంత భుయ్యాన్, జోగేంద్ర దత్, మనోజ్‌కుమార్ సాహు, సావిత్రీ బెహరాలకు ల్యాప్‌టాప్‌లు అందజేశారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరికి గాయాలు

బూర్జ : తోటవాడ పంచాయతీ టీఆర్ రాజుపేట ప్రధాన రహదారి వద్ద సోమవారం ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. తోటవాడ పంచాయతీ సుంకరాడ గ్రామానికి చెందిన తోట సత్యనారాయణ, టీఆర్ రాజుపేట గ్రామానికి చెందిన గుంద్రు శ్రీరామ్ కలిసి టీవీఎస్ ఎక్సెల్ బైక్‌పై కొల్లివలస నుంచి బూర్జ వైపు వస్తున్నారు. టీఆర్ రాజుపేట గ్రామం వద్ద సత్యనారాయణ బైక్ దిగుతుండగా పాలకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వీరి బండిని ఢీకొట్టింది. దీంతో శ్రీరాములు కాలికి దెబ్బలు తగిలాయి. సత్యనారాయణకు కాళ్లు, చేతులు విరిగిపోయాయి. వెంటనే 108 వాహనంలో వారిని పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సత్యనారాయణను శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. బస్సు ఆపకుండా వెళ్లిపోవడంతో స్థానికులు వెంబడించి ఆపారు. పోలీసులు వచ్చి బస్సు సిబ్బందిని అదుపులోకి తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది.



క్షతగాత్రులను 108 వాహనంలో శ్రీకాకుళం తరలిస్తున్న సిబ్బంది

రూ 65.4 లక్షలతో జిల్లా కేంద్రంలో అభివృద్ధి పనులు

- రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): జిల్లా కేంద్రంలో రూ.65.4 లక్షలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలో రూ 65.4లక్షలతో పూర్తిచేసిన రోడ్లు, డ్రైన్‌లను మంత్రి ధర్మాన మంగళవారం ప్రారంభించారు. ఎల్‌బీఎస్ కాలనీలో రూ 9.61 లక్షలతో, దమ్మల వీధిలో రూ. 15.80 లక్షల వ్యయంతో, గుజరాతీ పేటలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీరోడ్లు, డ్రైన్‌లను ఆయన ప్రారంభించారు. అలాగే ఆదివారంపేటలో రూ.19.80 లక్షల వ్యయంతో నిర్మించిన మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్ బిల్డింగ్ కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ రూ.3వేలు చేశారని పేర్కొన్నారు. 14 ఏళ్లు అధికారంలో ఉన్న టీడీపీ అమలు చేయలేని పనులు తాము చేశామన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీ మాయ మాటలు చెబుతోందని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ మెంటాడ పద్మావతీ, పట్టణ వైఎస్సార్ సీపీ నాయకులు సాదు వైకుంఠరావు, చల్లా శ్రీనివాస్, అంధవరపు ప్రసాద్, సంతోష్, పైడి రాజారావు, పొన్నాడ రుషి, గన్నిరాజు, కట్టబాబు, శోభన్, కన్నబాబు, మెరక సూర్య నారాయణ, బలగ గణపతి పట్నాయక్, టంకాల బాలకృష్ణ, ఎండ రమేష్, కామేశ్వరి, జ్యోతి, విజయ తదితరులు పాల్గొన్నారు.



దమ్మలవీధిలో రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

‘భవిష్యత్ లక్ష్యాలే కీలకం’

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి భవిష్యత్ లక్ష్యాలతో ముందుకు సాగాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి కె.సుధ అన్నారు. ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల/ జూనియర్ కళాశాలలో మంగళవారం యువ టూరిజం క్లబ్ ఏర్పాటు చేసి, అనంతరం వ్యక్తిత్వ వికాసం అంశంపై కౌన్సెలింగ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న రంగం వైపు వెళ్తే భవిష్యత్ ఉంటుందన్నారు. ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యత ఇస్తోందని, ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు ఉచితంగా అందజేస్తోందని చెప్పారు. అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన వంటి ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా టూరిజం శాఖ అధికారి ఎన్.నారాయణరావు మాట్లాడుతూ విజ్ఞానం, వినోదం లక్ష్యం యువ టూరిజం క్లబ్‌లు విద్యా సంస్థల్లో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సెట్‌శ్రీ జిల్లా మేనేజర్ వి.వి.అప్పలనాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మి పాల్గొన్నారు.



విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి సుధ

క్లుప్తంగా

డీఈఓ అభినందనలు

విజయనగరం అర్బన్: విజయవాడలో ఈ నెల 27 నుంచి నిర్వహించనున్న దక్షిణ భారత స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన పోటీలకు ఎంపికైన ప్రాజెక్టు రూపకర్త, రాజాం మండలం డోలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని ఐ.హాసినిని డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి మంగళవారం అభినందించారు. కడపలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆమె రూపొందించిన స్మార్ట్ ట్రాలీ ప్రయోగం ప్రథమ బహుమతి సాధించి రీజనల్ పోటీలకు ఎంపికైంది. విద్యార్థినితో పాటు గైడ్ ఉపాధ్యాయురాలు శ్రీదేవి, జిల్లా సైన్స్ అధికారి ఎం.కృష్ణారావు బృందాన్ని డీఈఓ అభినందించారు.

సోలార్ ఇన్‌స్టాలేషన్‌లో ఉచిత శిక్షణ

రాజాం: సోలార్ ప్యానల్ ఇన్‌స్టాలేషన్ టెక్నీషియన్ ఉచిత స్వయం ఉపాధి శిక్షణకు నాబార్డ్ సహకారంతో దరఖాస్తులు కోరుతున్నామని జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈనెల 18న ఆడ్మిషన్లు ఉంటాయని, ఈ శిక్షణ 60 రోజులు పాటు ఉంటుందని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. పదోతరగతి, ఐటీఐతో పాటు ఆ పై చదువులు చదివినవారంతా అర్హులని వెల్లడించారు. 19 నుంచి 35 సంవత్సరాలలోపు వయస్సు గల వారు శిక్షణకు హాజరు కావచ్చని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో భోజన, వసతి సదుపాయం ఉచితంగా అందజేయనున్నట్లు వివరించారు. రాజాంలోని జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్, సీఎస్‌డబ్ల్యూ ఆఫీస్, జీఎంఆర్ నగర్‌లో అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, మిగిలిన వివరాలకు ఫోన్ 81868 84244, 99890 57451 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్ స్వీకరణకు హెల్ప్ డెస్క్

విజయనగరం అర్బన్: పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్ స్వీకరణకు జిల్లా ఖజానా కార్యాలయంలో హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభించినట్లు ఉప సంచాలకుడు ఆర్‌ఎస్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని ఖజానా కార్యాలయం పరిధిలో గల పెన్షనర్లు జనవరి 1 నుంచి 29వ తేదీలోగా సర్టిఫికెట్లు అందజేయాలని తెలిపారు. అలాగే ప్రతి ఉప ఖజానా పరిధిలో కూడా పెన్షనర్ల సౌకర్యార్థం హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామన్నారు.

200 సారా ప్యాకెట్ల పట్టివేత



సారా ప్యాకెట్లతో నిందితుడిని అదుపులో తీసుకున్న ఎస్సై నీలకంఠేశ్వర్

కొమరాడ: మండలంలోని కుమ్మరిగుంట గ్రామ సమీపంలో 200 సారా ప్యాకెట్లు మంగళవారం పట్టుబడినట్లు ఎస్సై నీలకంఠేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికుల సమాచారం మేరకు సారా ప్యాకెట్లతో నిందితుడిని అదుపులోకి తీసుకుని సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేశామని తెలిపారు.

బావిలో మహిళ మృతదేహం

- అల్లుడే చంపేశాడని మృతురాలి తల్లి ఫిర్యాదు



బావిలో నుంచి తీసిన అన్నపూర్ణ మృతదేహం

బాడంగి: మండలంలోని కోటిపల్లి గ్రామానికి చెందిన వంగపండు అన్నపూర్ణ(27) తమ పొలంలోని నేలబావిలో మంగళవారం శవమై తేలింది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భర్త రామారావుతో కలిసి పొలంలోకి సోమవారం వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి రాలేదు. అన్నపూర్ణ ఎంతకీ ఇంటికి రాలేదని తెలుసుకున్న ఆమె తల్లి, తమ్ముడు వరుస వ్యక్తితో కలిసి వెతుకుతుండగా భార్యాభర్తలు సోమవారం గొడవపడిన విషయాన్ని అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వారికి చెప్పాడు. దీంతో వారు పొలంలోకి వెళ్లి బావి దగ్గర చూడగా అన్నపూర్ణ చెప్పులు, తువ్వాలు అక్కడ ఉన్నాయి. గెడకర్రతో బావినీటిలో వెతకగా శవం కనిపించగా బావురుమంటూ రోదించి మృతురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. గతంలో గొడవలు పడుతున్నప్పుడంతా తరచూ తనకూతుర్ని బావిలో తోసి చంపేస్తానని అల్లుడు బెదిరించే వాడని ఫిర్యాదులో పేర్కొంది. ఫిర్యాదు మేరకు ఏఎస్సై కొండలరావు సంఘటనా స్థలానికి వెళ్లి చూసి నిర్ధారించి ఇన్‌చార్జ్ ఎస్సై రమేష్‌కు సమాచారమివ్వగా బొబ్బిలి సీఐ తిరుమలరావుతో కలిసి ఆయన సంఘటనా స్థలానికి వచ్చి ప్రమాదపరిస్థితిపై విచారణ చేశారు. ఫిర్యాదు మేరకు నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక సీహెచ్‌సీలో భద్రపరిచారు. మృతురాలికి మూడేళ్ల వయస్సున్న అమ్మాయి ఉండగా, ప్రస్తుతం ఆమె మూడోనెల గర్భిణి.



కొండకరకాంలో రూ.50 కోట్లతో ఏర్పాటు చేసిన విజయనగరం వీట్ ప్రొడక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ

పారిశ్రామిక దన్ను

- ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సహిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం
- సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు రాయితీలు, రుణాలు, స్థలాల కేటాయింపు
- సింగిల్‌విండో విధానంలో అనుమతులు
- నాలుగేళ్లలో ఉమ్మడి విజయనగరం జిల్లాలో పెద్దఎత్తున పరిశ్రమల ఏర్పాటు
- రూ.151.44 కోట్లతో 892 సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు
- 4,700 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

విజయనగరం రూరల్: విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలు సహజవనరులకు ఆలవాలం. మానవ వనరులకు కొదవలేదు. వీటిని సద్వినియోగం చేసుకుంటూ పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చేవారిని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. నాలుగున్నరేళ్లుగా రుణాలు, రాయితీలు అందిస్తూ, స్థలాలు కేటాయిస్తూ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అండగా నిలుస్తోంది. సింగిల్ విండో పద్ధతిలో పారిశ్రామిక అనుమతులు మంజూరుచేస్తోంది. ప్రభుత్వ విధానాలు సత్ఫలితాలనిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాల్లో పారిశ్రామిక ప్రగతి ఊపందుకుంది. సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు పెద్ద ఎత్తున ఏర్పాటయ్యాయి. వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్నాయి.

ఉపాధి కల్పన

ఉమ్మడి విజయనగరం జిల్లా పరిధిలో 2019 నుంచి 2023 మధ్య కాలంలో రూ.151.45 కోట్లతో 892 సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. వీటి ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక రాయితీలు కల్పించింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన మొదటి ఏడాది 2019-20 మధ్య కాలంలోనే రూ.19.53 కోట్లతో 77 పరిశ్రమలు ఏర్పాటుకాగా, 2020-21 మధ్య కాలంలో రూ.10.40 కోట్లతో 41 యూనిట్లను మంజూరు చేశారు. అలాగే, 2021-22 మధ్య కాలంలో రూ.37.50 కోట్లతో 81 యూనిట్లు ఏర్పాటుకాగా, 2022-23 మధ్య కాలంలో అత్యధికంగా రూ.74.05 కోట్లతో 548 యూనిట్లను ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ఏర్పాటు చేశారు. 2023-24 సెప్టెంబర్ నెల వరకు రూ.9.98 కోట్లతో 145 యూనిట్లు ఏర్పాటయ్యాయి. వీటిలో 4,700 మంది యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు.

ప్రభుత్వ సహకారం మరువలేనిది



రాష్ట్ర ప్రభుత్వం మహిళా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తూ ఎంఎస్‌ఎస్‌ఈల ఏర్పాటుకు తక్కువ వడ్డీ, రాయితీ రుణాలను అందిస్తోంది. మిల్లెట్ పరిశ్రమ ఏర్పాటుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సహాయంతో ప్రభుత్వమే రూ.4.06 కోట్లు గ్రాంట్‌గా మంజూరు చేసింది. దీంతో ఎల్.కోట మండలంలో మహిళా రైతులతోనే చిరుధాన్యాల పరిశ్రమను ఏర్పాటు చేశాం. పరిశ్రమలో 20 మందికి నేరుగా, మరో 5 వేల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తోంది. ఏటా 7,600 టన్నుల సామర్థ్యంతో పరిశ్రమను నడుపుతున్నాం. వచ్చే లాభాలను డివిడెండ్ రూపంలో 1500 మంది సభ్యులకు సమానంగా ఇస్తాం.

– కొమ్మోజుల సరస్వతి, సీఈఓ, ఆరోగ్య మిల్లెట్ ప్రొడ్యూసర్ కంపెనీ, ఎల్.కోట మండలం



ఎల్.కోట మండలంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య మిల్లెట్ ప్రొడ్యూసర్ కంపెనీ



చిరుధాన్యాల పరిశ్రమల లోపలి భాగం

స్వశక్తికి తోడు ప్రభుత్వ సహకారం



మాది జిల్లాలోని చీపురుపల్లి గ్రామం. నేను ఎంబీఏ పూర్తి చేశాను. చదువు పూర్తి చేసుకుని కొన్ని ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు చేశాను. అయినా, ఎక్కడో కొంత అసంతృప్తి ఉండేది. అప్పటికే నా తండ్రి అంధవరపు హరిప్రసాద్ వ్యాపార రంగంలో రాణించడంతో సొంతంగా పరిశ్రమ నెలకొల్పాలన్న ఆలోచన మదిలో మెదిలింది. పరిశ్రమ స్థాపించాలన్న ఆలోచనకు 2019లో బీజం పడింది. ప్రైవేటు ఉద్యోగానికి స్వస్తిపలికాను. రాష్ట్ర ప్రభుత్వం, యువ ఔత్సాహిక పరిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ నూతన పారిశ్రామిక విధానానికి శ్రీకారం చుట్టడంతో రూ. 50 కోట్లతో విజయనగరం మండలం కొండకరకాం గ్రామంలో విజయనగరం వీట్ ప్రొడక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో పరిశ్రమను స్థాపించాను. పరిశ్రమలో గోధుమ పిండి, గోధుమ నూక, మైదా పిండి, పూరీపిండి, గోధుమ తవుడు ఉత్పత్తిని ప్రారంభించాను. కరోనా కారణంగా రెండేళ్లపాటు ఇబ్బందులు తలెత్తాయి. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో కొద్ది నెలలుగా వ్యాపారం పుంజుకోవడం మొదలైంది. ప్రస్తుతం పరిశ్రమ టర్నోవర్ ఏడాదికి రూ.30 కోట్లకు చేరుకుంది. నెలకు 1000 నుంచి 1500 టన్నుల వరకు ఉత్పత్తి జరుగుతోంది. పరిశ్రమలో 80 మంది వరకు ప్రత్యక్షంగా, 80 మంది వరకు పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాను. నా కలను నిజం చేసుకుంటూ పరిశ్రమను స్థాపించడమే కాకుండా నిరుద్యోగ యువత 10 మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించానన్న సంతృప్తి కలుగుతోంది.

– అంధవరపు నరేష్, యువ ఔత్సాహిక పారిశ్రామికవేత్త

స్వయం ఉపాధికి అవకాశం

మాది విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని పీఎస్ఆర్ కాలనీ. నేను ఎంబీఏ పూర్తి చేసి 2010-18 మధ్య కాలంలో ప్రైవేటు కంపెనీలో మార్కెట్ ఎగ్జిక్యూటివ్‌గా ఉద్యోగం చేశాను. ఉద్యోగం చేసిన అనుభవంతో సొంతంగా ఒక పరిశ్రమ నెలకొల్పాలన్న ఆలోచన కలిగింది. నాలాంటి వారికి ఉపాధి అందించగలనన్న నమ్మకం కలగడంతో ముందుగా పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అందిస్తుందన్న ప్రోత్సాహకాలు, రాయితీలు విషయాన్ని తెలుసుకుని దరఖాస్తు చేశాను. ప్రభుత్వం రుణం మంజూరు చేయడంతో 2019లో పూసపాటిరేగ మండలంలో రూ.25 లక్షలతో ఆహార ఉత్పత్తుల పరిశ్రమను ఏర్పాటు చేశాను. తొలుత నాతోపాటు కేవలం ఇద్దరు వ్యక్తులే పరిశ్రమలో పనిచేసేవారం. ప్రస్తుతం పరిశ్రమ టర్నోవర్ నెలకు రూ.2.4 కోట్లకు చేరుకుంది. 20 మందికి ఉపాధి కల్పిస్తున్నాను. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిశ్రమల స్థాపనకు అందిస్తున్న ప్రోత్సాహం, రాయితీలు బాగున్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా పదుల సంఖ్యలో నిరుద్యోగులకు ఉపాధి అందిస్తున్నానన్న ఆనందం కలుగుతోంది.



పూసపాటిరేగ మండలంలో రూ.25 లక్షలతో ఏర్పాటు చేసిన ఇండియన్ గ్రాసరీ కంపెనీలో ఆహార ఉత్పత్తుల తయారీ



– డి.ప్రసన్నకుమార్, ఔత్సాహిక పారిశ్రామివేత్త, ఇండియన్ గ్రాసరీస్ కంపెనీ, పూసపాటిరేగ మండలం

చక్కని ప్రోత్సాహం



పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు, రాయితీలు, సింగిల్ విండో విధానంలో అనుమతులు మంజూరు చేస్తోంది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఇది కలిసివచ్చే అవకాశం. దరఖాస్తు చేసుకున్న వెంటనే పరిశీలించి అనుమతులు మంజూరుచేస్తోంది.

– ఎ.పాపారావు, జనరల్ మేనేజర్, జిల్లా పరిశ్రమల శాఖ

ఆరోగ్యశ్రీ ఉండగా..

భయమెందుకు దండగ..!

- మరింత మెరుగ్గా వైద్యసేవలు
- 3,257 వ్యాధులకు చికిత్స
- ఆరోగ్య మిత్రాలకు షిఫ్ట్ విధులు

విజయనగరం ఫోర్ట్: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్యసేవలు మరింత మెరుగ్గా అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఆరోగ్యశ్రీ పథకం అమలులో కీలక పాత్ర పోషించే మిత్రాలు సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకుంది. ప్రభుత్వం ఆరోగ్యశ్రీ వ్యయ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచింది. పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన వారు వైద్యం కోసం డబ్బులు ఖర్చు చేయకూడదన్నది ప్రభుత్వ లక్ష్యం. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కేవలం 1000 వ్యాధులకు మాత్రమే ఆరోగ్యశ్రీ పథకాన్ని వర్తింపజేశారు. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరోగ్య శ్రీ పథకంలో వ్యాధుల సంఖ్యను 3,257కు పెంచింది. అంతేకాకుండా వైద్యం ఖర్చు రూ.వెయ్యి దాటిన వ్యాధులను కూడా ఆరోగ్యశ్రీలో చేర్చింది. దీని వల్ల ఏటా వేలాది మంది ఆరోగ్యశ్రీ పథకాన్ని వినియోగించుకుంటున్నారు. అంతేకాకుండా దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే ఆరోగ్య ఆసరా కింద ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్స చేసుకున్న రోగికి భృతిని చెల్లిస్తున్నారు.

జిల్లాలో 28 నెట్‌వర్క్ ఆస్పత్రులు

జిల్లాలో ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు 28 ఉన్నాయి. వాటిలో గజపతినగరం ఏరియా ఆస్పత్రి, రాజాం ఏరియా ఆస్పత్రి, ఎస్. కోట ఏరియా ఆస్పత్రి, సీహెచ్‌సీ బాడంగి, సీహెచ్‌సీ భోగాపురం, సీహెచ్‌సీ బొబ్బిలి, సీహెచ్‌సీ చీపురుపల్లి, సీహెచ్‌సీ నెల్లిమర్ల, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి విజయనగరం, విజయనగరం ఘోషా ఆస్పత్రి, అభినవ ఆస్పత్రి ఎస్.కోట, ఎస్.కోట కొలపర్తి ఆస్పత్రి, విజయనగరం సాయి పీవీఆర్ ఆస్పత్రి, సాయి సూపర్ స్పెషాలిటీ హాస్పటల్, వెంకటరామ ఆస్పత్రి, ఆంధ్ర హాస్పిటల్, మారుతి ఆస్పత్రి, పీజీ స్టార్ ఆస్పత్రి, స్వామి కంటి ఆస్పత్రి, నెఫ్రోప్లస్ ఆస్పత్రి, నెల్లిమర్ల మిమ్స్ ఆస్పత్రి, మువ్వ గోపాల ఆస్పత్రి, గాయత్రి ఆస్పత్రి, పుష్పగిరి ఐ ఆస్పత్రి, తిరుమల నర్సింగ్ హోమ్, శ్రీనివాస్ నర్సింగ్ హోమ్, జీఎంఆర్ కేర్ ఆస్పత్రి, అమృత ఆస్పత్రులు ఉన్నాయి. ఈనెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్య మిత్రాలు 90 మంది షిఫ్టుల ప్రకారం పనిచేస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, 2 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు రాత్రి 8 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు ఆరోగ్య మిత్రాలు పనిచేస్తున్నారు.

హెల్ప్‌డెస్క్ వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు

నెట్‌వర్క్ ఆస్పత్రుల్లోని మిత్రా హెల్ప్ డెస్క్ వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఆస్పత్రికి వచ్చిన రోగికి ఆరోగ్య మిత్రాలు రిజిస్ట్రేషన్ చేస్తారు. శస్త్రచికిత్స అవసరమైన వారిని వార్డులో చేర్పించి సకాలంలో శస్త్రచికిత్స అయ్యే విధంగా ఫాలోఅప్ చేస్తారు. ప్రతి రోజూ వార్డులో పర్యటించి రోగులకు అందుతున్న వైద్యసేవల గురించి ఆరా తీస్తారు. అదేవిధంగా రోగులకు అందించే భోజనాన్ని పరిశీలిస్తారు. రోగులనుంచి ఫిర్యాదులు వస్తే వాటిని ఉన్నతాధికారుల దష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తారు. ఆరోగ్య మిత్రాలు సమయపాలన పాటిస్తున్నారా? లేదా? అని పర్యవేక్షించేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అదేవిధంగా రోగులతో ఏవిధంగా ప్రవర్తిస్తున్నారో సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తారు. ఏటా వేలాది మందికి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్యసేవలు పొందుతున్నారు.



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ప్రభుత్వం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసింది. ఆరోగ్య మిత్రాలు రోగులతో ఏవిధంగా వ్యవహరిస్తున్నారో పర్యవేక్షించేందుకు వీలుంటుంది.

– డాక్టర్ ఉప్పు అప్పలరాజు, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



సుశాంత్ గౌడ్ మృతదేహం

చీపురుపల్లి: పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడి ఒడిశాకు చెందిన సుశాంత్ గౌడ్ మృతి చెందినట్లు జీఆర్‌పీ ఎస్సై సీహెచ్.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రంలోని గంజాం జిల్లాకు చెందిన సుశాంత్ గౌడ్ (35) సూరత్‌లోని వస్త్ర పరిశ్రమలో పనిచేస్తున్నాడు. అక్కడి నుంచి సొంతూరుకు వాకా-పూరీ రైలులో బయిలుదేరాడు. ఈ క్రమంలో జనవరి 1న సాయంత్రం 6 గంటల సమయంలో చీపురుపల్లి రైల్వేస్టేషన్ పరిసరాల్లో రైలు నుంచి జారి పడి మృతిచెందాడు. మృతుని శరీరంపై నీలం రంగు ఫ్యాంట్ తప్ప మరేమీ లేవన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రైలు ఢీకొని మరో యువకుడు..



గోవింద మృతదేహం

పార్వతీపురంటౌన్: కొమరాడ మండలం గుమడ-కూనేరు రైల్వే స్టేషన్ మధ్య డౌన్‌లైన్‌లో రైలు ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సమాచారం అందుకున్న పార్వతీపురం రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి దర్యాప్తు చేసి మృతుడిని కొమరాడ మండలంలోని దేవుకోన పంచాయతీ అంటివలస గ్రామానికిచెందిన మెల్లక గోవింద (25)గా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే ఆత్మహత్యకు పాల్పడ్డాడా? ఏదైనా గుర్తుతెలియని రైలు ఢీకొందా అని రైల్వే పోలీసులు అనుమానం వెలిబుచ్చారు. జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ రత్నాకర్ అనుమాన స్పద మృతి కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

11 మేకలు..



రైలు ప్రమాదంలో మృతి చెందిన మేకలు

గుర్ల: మండలంలోని సొలిపిసోమరాజు పేట వద్ద రైల్వే ట్రాక్‌పై మంగళవారం రైలు ఢీకొట్టడంతో 11 మేకలు మృతి చెందాయి . గుర్ల గ్రామానికి చెందిన కమ్మిండి అప్పలస్వామి మేకల మంద మేత మేస్తూ రైల్వే ట్రాక్‌పైకి వెళ్లాయి. అదే సమయంలో రైలు రావడంతో ప్రమాదం జరిగింది. మృతి చెందిన మేకల విలువ రూ.లక్ష ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

సక్రమంగా రేషన్ పంపిణీ

- జేసీ మయూర్ అశోక్



ఎండీయూ వాహనం వద్ద రేషన్ బియ్యాన్ని పరిశీలిస్తున్న జేసీ మయూర్ అశోక్

విజయనగరం: లబ్ధిదారులందరికీ రేషన్ సరుకులను ఇంటింటికీ పంపిణీ చేయాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఆదేశించారు. విజయనగరం పట్టణంలోని కణపాక ప్రాంతంలో ఎండీయూ-6 వాహనం ద్వారా జరుగుతున్న రేషన్ పంపిణీ ప్రక్రియను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి బియ్యం, గోధుమ పిండి, కందిపప్పుల నాణ్యత, నెలనెలా పంపిణీపై కార్డుదారులను ఆరా తీశారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న బియ్యాన్ని ప్రతిఒక్కరూ వినియోగించాలని సూచించారు. ఎండీయూ వాహన ఆపరేటర్‌తో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసినవారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తనిఖీలో జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి కె.మధుసూదనరావు, డీటీలు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ టెన్నికాయిట్ పోటీలకు నలుగురి ఎంపిక



చీపురుపల్లి రూరల్: జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినిని అభినందిస్తున్న హెచ్ఎం, పీడీ



చీపురుపల్లి రూరల్: జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారిణులను అభినందిస్తున్న నిర్వాహకులు

చీపురుపల్లి రూరల్: జాతీయస్థాయిలో జరగనున్న టెన్నికాయిట్ పోటీలకు గరివిడి మండలంలోని కొండలక్ష్మీపురం గ్రామానికి చెందిన ఎం.ప్రవల్లిక, ఆర్.మౌనిక, పి.రేణుక, జి.శ్రావణిలు ఎంపికయ్యారు. టెన్నికాయిట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 2023 డిసెంబర్ 28 నుంచి 30 వరకు 41వ ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ సీనియర్ టెన్నికాయిట్ పోటీలు శ్రీకాకుళం జిల్లాలోని పాతపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఆ పోటీల్లో ఎంపికైన ప్రవల్లిక, ఆర్.మౌనిక, పి.రేణుక, జి.శ్రావణిలు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనపరిచడంతో జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జనవరి 9 నుంచి 13 వరకు శ్రీకాకుళం జిల్లాలోని పలాసలో జరగనున్న జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీలు జరగనున్నాయి. జాతీయస్థాయిలో జరగనున్న పోటీలకు ఎంపికైన వారిని చీపురుపల్లి ఆదర్శ కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ డా.ఎం.రమేష్ కుమార్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా.కె.జ్వాలాముఖి, ఇతర అధ్యాపకులు, కొండలక్ష్మీపురం గ్రామస్తులు అభినందించారు.

రోప్‌మాల్కంబ్ పోటీలకు ప్రవల్లిక

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలోని కాపుశంభాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న పైల ప్రవల్లిక స్కూల్ గేమ్స్ పోటీల్లో అండర్-14 విభాగంలో జాతీయ స్థాయి రోప్ మాల్కంబ్ పోటీలకు ఎంపికైంది. బాపట్ల జిల్లాలో నవంబర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఆమె ఈనెల 6నుంచి 10వ తేదీ వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఉజ్జయినిలో జరగనున్న అఖిల భారత స్కూల్‌గేమ్స్ పోటీల్లో పాల్గొని రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించనుంది. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం డి.రాము, పీడీ ఎం.ఉదయ్‌కుమార్‌లు విద్యార్థినిని అభినందించారు.

యువకుడికి తీవ్ర గాయాలు



గాయపడిన యువకుడిని 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం, చిత్రంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని మొయిద బ్రిడ్జి వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై ఎస్సై నారాయణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గరివిడి మండలంలోని గెడ్డపువలస గ్రామానికి చెందిన బాలాజీ బైక్‌పై నెల్లిమర్ల నుంచి గుర్ల వెళ్తుండగా..ఎదురుగా వస్తున్న ఆటో బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న బాలాజీ తలకు తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో గుర్ల పర్యటన ముగించుకుని తిరిగివస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు ప్రమాదాన్ని గుర్తించి మానవత్వంతో స్పందించారు. కాన్వాయ్‌ను ఆపి వెంటనే 108 వాహనానికి సమాచారం అందించి, వాహనం వచ్చే వరకు అక్కడే ఉండి క్షతగాత్రుడిని వాహనం ఎక్కించి ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

జర్నలిస్టుల ఇళ్లస్థలాల మంజూరుకు కమిటీ

- ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులు 220
- 2024 జనవరి 6తో ముగియనున్న ఆన్‌లైన్ గడువు
- నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలి: కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: అక్రిడేటెడ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల మంజూరు కోసం జిల్లా స్థాయి కమిటీని వేస్తూ కలెక్టర్ నాగలక్ష్మి ఉత్తరులు జారీ చేశారు. జిల్లాలో జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటైందని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి చైర్మన్‌గా కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి, రెవెన్యూ డివిజన్ అధికారులు, డీపీఆర్ఓ, ముగ్గురు జర్నలిస్టులు సభ్యులుగా ఈ కమిటీలో ఉంటారని తెలిపారు. జర్నలిస్టుల విభాగం నుంచి అల్లు సూరిబాబు (బ్యూరో చీఫ్, సాక్షి), వర్రి వెంకట జగన్నాధరావు (స్టాఫ్ రిపోర్టర్, ఎన్-టీవీ), ఎంఎంఎల్‌నాయుడు (స్టాఫ్ రిపోర్టర్, 10-టీవీ) సభ్యులుగా జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటైనట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఇళ్లస్థలాలు గుర్తించే ప్రక్రియ కమిటీ ఇప్పటికే ప్రారంభించిందని, ఇళ్ల స్థలాలకు అర్హులైన జర్నలిస్టుల తుది జాబితా రూపొందించనున్నట్లు చెప్పారు. అక్రిడేటెడ్ జర్నలిస్టులకు కేటాయించే ఇళ్ల స్థలాల విషయంలో ప్రభుత్వ విలువ ప్రకారం 60 శాతం ప్రభుత్వం, 40 శాతం జర్నలిస్టులు చెల్లించాల్సి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. వివిధ మీడియా సంస్థల్లో పనిచేస్తూ అక్రిడిటేషన్ కార్డు కలిగిన అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను అందించేందుకు ప్రభుత్వం జీవో నంబర్ 535ను జారీ చేసిందని కలెక్టర్ తెలిపారు. వచ్చిన దరఖాస్తులన్నింటిని జీఓలో పేర్కొన్న నిబంధనల మేరకు జర్నలిస్టుల వృత్తి అనుభవాన్ని సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు పరిశీలించి ప్రాథమికంగా ధ్రువీకరించి అర్హులైన జర్నలిస్టుల జాబితాను తదుపరి వెరిఫికేషన్ కోసం జిల్లా స్థాయి కమిటీకి సమర్పిస్తారని తెలిపారు. ఇప్పటివరకు 220 దరఖాస్తులు అందాయని, 2024 జనవరి 6తో గడువు ముగుస్తున్నందున, అర్హులైన జర్నలిస్టులందరూ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. 'ఐపీఆర్.ఏపీ.జీఓవీ.ఐఎన్' వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.